భక్తజనకీలాద్రి



శ్రావణ మాసం ఆదివారాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర దేవస్థానంలో కనకదుర్గమ్మను దర్శించుకోవటానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలైన్లు కిటకిటలాడాయి. ఆలయ ప్రాంగణం భక్తులతో నిండిపోయింది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో వీకే శీనానాయక్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. (ఆంధ్రజ్యోతి-ఇంద్రకీలాద్రి)

● తగ్గిన వరద



నాగాయలంక రేవులో తగ్గుముఖం పట్టిన వరద

నిన్న మొన్నటి వరకు ప్రకాశం బ్యారేజీ నుంచి ఉధృతంగా ప్రవహించిన వరద ఆదివారం తగ్గుముఖం పట్టింది. దీంతో బిక్కుబిక్కుమంటున్న తీర ప్రాంత గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. మత్స్యకారులు తమ పడవలను బాగు చేసుకుంటూ వేటకు సిద్ధమవుతున్నారు. (ఆంధ్రజ్యోతి-నాగాయలంక)

ఎరువుల మాయం!

అందుబాటులో లేని యూరియా, కాంప్లెక్స్ ఎరువులు

జిల్లాలో కృత్రిమ కొరత సృష్టిస్తున్న వ్యాపారులు

- రూ.266.50 యూరియా బస్తా రూ.350 నుంచి రూ.450 విక్రయం
- జింక్ ప్యాకెట్ కొంటేనే కాంప్లెక్స్ ఎరువుల అమ్మకం అంటూ షరతు
- జిల్లాస్థాయి డీలర్ల గుప్పిట్లో ఎరువులు!
- పట్టించుకోని అధికారులు.. ఆర్థికంగా చితికిపోతున్న రైతులు

జిల్లాలో రైతులను యూరియా, కాంప్లెక్స్ ఎరువుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. పలువురు వ్యాపారులు ఎరువులను దాచేసి కృత్రిమ కొరతను సృష్టించి, అధిక ధరలకు విక్రయం చేస్తున్నారు. వరినాట్లు ముమ్మరంగా సాగుతున్న సమయంలో ఎరువుల విక్రయాలపై నిఘా పెంచాల్సిన వ్యవసాయశాఖ అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ఆర్ఎస్‌కేల్లో యూరియా అందుబాటులో లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో రైతులు బ్లాక్‌మార్కెట్‌లో వ్యాపారులు చెప్పిన అధిక ధర చెల్లించి కొనుగోలు చేస్తూ ఆర్థికంగా చితికిపోతున్నారు.



పొలంలో నాటు వేసే ముందు ఎరువులు చల్లుతున్న రైతులు (ఇన్‌సెట్‌లో) యూరియా, కాంప్లెక్స్ ఎరువుల బస్తాలు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: కృష్ణాజిల్లాకు సంబంధించి యూరియాతో పాటు మిగిలిన కాంప్లెక్స్ ఎరువులు మొత్తం గుడివాడ నుంచి పంపిణీ జరుగుతుంది. ఆయా కంపెనీల నుంచి వచ్చిన యూరియా, ఇతర కాంప్లెక్స్ ఎరువులను గుడివాడలోని గోడౌన్‌లలో దింపి, అక్కడి నుంచి ఆర్ఎస్‌కేలు, జిల్లా డీలర్లు, రిటైల్ వ్యాపారులకు అందజేస్తారు. ముందస్తుగా ఆర్ఎస్‌కేలకు మార్క్‌ఫెడ్ ద్వారా ఎరువులను డిమాండ్‌కు అనుగుణంగా పంపాలి. రైతులు పీఏసీఎస్‌ల వద్దకు వెళితే యూరియా, ఇతర ఎరువులు స్టాక్‌లేవనే సమాధానం వస్తోంది. 45 కిలోల బ్యాగ్ మాత్రమే ఇచ్చి సరిపెడుతున్నారు. అది కూడా కొంతమందికే ఇచ్చి స్టాక్ అయిపోయిందని అంటున్నారు. రిటైల్ వ్యాపారుల వద్దకు వెళితే మా వద్ద స్టాక్‌లేదని, అధికధర మిగతా 6లో..

అనధికారానికి హోలో చెప్పేద్దాం!

శరన్నవరాత్రుల్లో వీఐపీ దర్శనాలకు కొత్త విధానం

- ముద్రించిన టికెట్లు జారీ చేయాలని నిర్ణయం
- వాటిపై హోలోగ్రామ్ అతికించే యోచన
- ఈ టికెట్లు ఉన్న వారికి 'ఓం' దగ్గర నుంచి ప్రవేశం




వీఐపీ... శరన్నవరాత్రుల్లో పోలీసులు, దుర్గామల్లేశ్వరస్వామి ఆలయ అధికారులు, రెవెన్యూ అధికారులను ఇబ్బంది పెడుతున్న పదవి ఇది. ప్రతి ఏడాది ఇదొక సమస్యగా మారుతోంది. ఇదే వివాదాలకు కారణమవుతోంది. అసలు వీఐపీల కంటే అనధికార వీఐపీలతోనే అసలు సమస్య వస్తోందని గుర్తించిన అధికారులు ఈ ఏడాది శరన్నవరాత్రి ఉత్సవాల్లో కొత్త విధానాన్ని అమలు చేయాలని భావిస్తున్నారు. అనధికార వీఐపీలకు చెక్ పెట్టడానికి ముద్రణ టికెట్లు జారీ చేయాలని నిర్ణయించారు. వాటి ద్వారా నకిలీ టికెట్లు పుట్టకుండా ముద్రించిన టికెట్లపై హోలోగ్రామ్ స్టిక్కర్‌ను అతికించాలని నిర్ణయించారు. ఇటీవల నిర్వహించిన శర్నవరాత్రి ఉత్సవాల సమన్వయ కమిటీ సమావేశంలో ఈ రెండు నిర్ణయాలపై చర్చ సాగింది.

(ఆంధ్రజ్యోతి - విజయవాడ): ఇంద్రకీలాద్రిపై సెప్టెంబరు 22 నుంచి అక్టోబరు రెండో తేదీ వరకు శరన్నవరాత్రులు జరుగుతాయి. ప్రతి ఏడాది పది రోజులపాటు సాగే ఉత్సవాలు ఈ ఏడాది తిథుల వృద్ధి కారణంగా 11 రోజులపాటు నిర్వహించాలని వైదిక కమిటీ నిర్ణయించింది. శరన్నవరాత్రుల్లో ఇంద్రకీలాద్రికి వీఐపీల తాకిడి సాధారణ రోజులకంటే ఎక్కువగా ఉంటుంది. వీఐపీలు స్వయంగా రావడంతోపాటు మిగతా 6లో..

నిబంధనలు పాటించకుండా వాదనలు

ప్రొటోకాల్ జాబితాలో ఉన్న వారిని చిన్న రాజగోపురం వద్ద నుంచి ఆలయ అధికారులు తీసుకెళ్లి దర్శనాలు చేయిస్తారు. ఇక సిఫార్సులతో వచ్చే వీఐపీల కోసం ఘాట్‌రోడ్డులోని ఓం మలుపు వద్ద ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేస్తారు. అందులో నుంచి వాళ్లంతా దర్శనాలకు వెళ్లాల్సి ఉంటుంది. సిఫార్సులతో వచ్చే భక్తులు ఈ నిబంధనను పాటించడం లేదు. ఓం మలుపు వద్ద ఏర్పాటు చేసిన క్యూలో నుంచి వెళ్లడానికి ఇష్టపడడం లేదు. దీంతో అక్కడ ఏర్పాటు చేసే చెక్‌పోస్టు వద్ద విధుల్లో ఉన్న అధికారులతో వివాదాలకు దిగుతున్నారు. అక్కడి నుంచే సిఫార్సు చేసిన వీఐపీలకు ఫోన్లు చేయడం, వారు తిరిగి అధికారులకు ఫోన్ చేసి ఆగ్రహం వ్యక్తం చేయడం జరుగుతోంది.

● కృష్ణమ్మ పరవళ్లు





కృష్ణానదికి ఎగువ నుంచి వచ్చిన వరదను ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు విడుదల చేస్తున్నారు. పరవళ్లు తొక్కుతూ కడలి వైపు పరుగులు తీస్తున్న కృష్ణమ్మను చూసేందుకు బెజవాడ వాసులు భారీగా తరలివస్తున్నారు. కనులారా నీటి ప్రవాహాన్ని చూసి పులకించిపోతున్నారు. దీంతో ప్రకాశం బ్యారేజీ వద్ద సాయంత్రం వేళ రద్దీ ఏర్పడుతోంది.
-ఆంధ్రజ్యోతి- విజయవాడ

పిడుగుపాటుకు మహిళా వ్యవసాయ కూలీ మృతి 6

స్టాంపింగ్ దోపిడీ!

తూనికలు, కొలతల శాఖ లైసెన్స్‌డ్ రిపేరర్ల కక్కుర్తి!

- కాటాల స్టాంపింగ్‌లో ప్రభుత్వ ఆదేశాలు బేఖాతర్
- సర్వీస్ ప్రొవైడర్స్‌ను కాదని లైసెన్సింగ్ ఏజెన్సీలతో పనులు
- ఒక్కొక్కరి నుంచి రూ. 1000 వసూలు!

చౌక దుకాణాల కాటాల స్టాంపింగ్ విషయంలో తూనికలు, కొలతల శాఖ అధికారులు తమ అక్రమ వసూళ్ల పర్వం యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. ఇటీవల మైలవరంలో కాటాల స్టాంపింగ్ పేరుతో లైసెన్స్‌డ్ రిపేరర్లు అడ్డగోలుగా డబ్బులు దండుకున్నారు. స్టాంపింగ్ విషయంలో ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను తుంగలో తొక్కేస్తున్నారు. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



మైలవరంలో జరుగుతున్న కాటా స్టాంపింగ్ ప్రక్రియ

ఆంధ్రజ్యోతి-విజయవాడ: గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పౌరసరఫరాలశాఖలో నూతన సంస్కరణలను ప్రవేశ పెట్టారు. పేదలకు ఇస్తున్న బియ్యంలో తూకం మోసాలను అరికట్టడానికి, జవాబుదారీ తీసుకురావటానికి వీలుగా అప్పటి వరకు ఉన్న రాళ్ల కాటాలను తొలగించి ఎలక్ట్రానిక్ కాటాలను ప్రవేశపెట్టారు. ఎలక్ట్రానిక్ కాటాలకు ఈ పోస్ యంత్రాన్ని అనుసంధానం చేసే విధానాన్ని తీసుకు వచ్చారు. ఈ విధానంతో రేషన్ దుకాణాల్లో అప్పటి వరకు తలెత్తే కాటాల మాయాజాలానికి తెరపడింది. మాన్యువల్ కాటాలను రెండు సంవత్సరాలకు ఒకసారి తనిఖీ చేసి తూకం రాళ్లకు సీల్ వేసే విధానం పోయి ఎలక్ట్రానిక్ కాటాలకు సంవత్సరానికి ఒక సారి సీల్ వేసే విధానం వచ్చింది. రేషన్ దుకాణాలకు ఇచ్చిన కాటాలను అప్పటి ప్రభుత్వం 'కాల్ ఆన్ కంపెనీ' నుంచి కొనుగోలు చేసింది. కాటాకు ఏవిధమైన మరమ్మతులు వచ్చినా 'కాల్ ఆన్ కంపెనీ' చేయాలి. కానీ సంవత్సరానికి ఒక సారి తూనికలు, కొలతల అధికారులు సీల్ పేరిట వచ్చి రేషన్ డీలర్ల నుంచి అక్రమంగా రూ. 1,000, 1,500 చొప్పున వసూలు చేసేవారు. గత ఏడాది ఇదే విషయంపై రేషన్ డీలర్ల సంఘాలు కమిషనరేట్ అధికారులకు ఫిర్యాదు మిగతా 6లో..



ఆసుపత్రిలో కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్ (ఇన్‌సెట్‌లో) వసంత రాయులు (ఫైల్)

అవయవదానం

రోడ్డు ప్రమాదంలో గాయపడిన కృత్తివెన్ను మండలం చందాల వాసి

- గుంటూరు రమేష్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్
- వసంత రాయులు అవయవాలు దానం చేయడానికి ముందుకొచ్చిన కుటుంబ సభ్యులు
- డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆరా.. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి
- కుటుంబాన్ని పరామర్శించిన ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్

కృత్తివెన్ను, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మరణించిన తర్వాత కూడా జీవించే అవకాశం అవయవదానంతోనే సాధ్యమని నమ్మిన ఓ కుటుంబం వారి కుటుంబ పెద్ద బ్రెయిన్‌డెడ్ కావటంతో ఆయన అవయవాలు దానం చేసేందుకు ముందుకొచ్చి పలువురికి ఆదర్శంగా నిలిచింది. కృత్తివెన్ను మండలం చందాల గ్రామానికి చెందిన మిగతా 6లో..

పంచాయతీలకు బకాయిల బండ!

సీఆర్‌డీఏ నుంచి రావాల్సింది రూ.100 కోట్లపైనే..

- ఒక్క గొల్లపూడికే రూ.65 కోట్ల బకాయి
- పదేళ్లుగా పంచాయతీలకు డెవలప్‌మెంట్ చార్జీలు ఇవ్వని సీఆర్‌డీఏ
- ఈ జాబితాలో రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, గూడవల్లి, నిడమానూరు, గన్నవరం..
- ఇబ్రహీంపట్నం, కొండపల్లి, మైలవరానికి అందని డెవలప్‌మెంట్ చార్జీలు
- నిధులు లేక మౌలిక సదుపాయాలకు నోచుకోని గ్రామాలు
- కలెక్టర్ లక్ష్మీశకు ఫిర్యాదు చేసిన గ్రామ పాలకవర్గాలు
- బకాయిలు చెల్లించాలని సీఆర్‌డీఏ కమిషనర్‌కు కలెక్టర్ లేఖ



గొల్లపూడిలో భారీగా నిర్మితమైన అపార్ట్‌మెంట్లు

గ్రేటర్ విజయవాడ విలీన ప్రతిపాదిత గ్రామ పంచాయతీలను బకాయిల బండ వేధిస్తోంది. డెవలప్‌మెంట్ చార్జీల కింద సీఆర్‌డీఏ నుంచి రూ.100 కోట్లపైనే బకాయి ఉంది. ఏళ్ల తరబడి ఈ బకాయిలు రాక గ్రామ పంచాయతీలు విలవిల్లాడుతున్నాయి. విస్తరిస్తున్న నిర్మాణ రంగానికి తగినట్టుగా మౌలిక సదుపాయాలు కల్పించలేకపోతున్నాయి. ప్రజల నుంచి వ్యతిరేకతను మూట కట్టుకుంటున్నాయి. విధిలేని పరిస్థితుల్లో కలెక్టర్ లక్ష్మీశ దృష్టికి విషయం తీసుకెళ్లాయి. ఆయన సీఆర్‌డీఏ కమిషనర్‌కు లేఖ రాశారు. వెంటనే బకాయిలు విడుదల చేయాలని కోరారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): గ్రేటర్ విజయవాడ విలీన ప్రతిపాదిత గ్రామాలుగా గొల్లపూడి, ఇబ్రహీంపట్నం, కొండపల్లి, రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, గూడవల్లి, నిడమానూరు, గన్నవరం తదితర గ్రామాలు ఉన్నాయి. విజయవాడ నగరంతో సమానంగా అభివృద్ధి చెందుతున్నాయి. గత దశాబ్ద కాలంగా ఆయా గ్రామాల్లో నిర్మాణ రంగం ఊపందుకుంది. గ్రూప్ హౌస్‌లు, మల్టీస్టోర్డ్ బిల్డింగ్‌లు, భారీ అపార్ట్‌మెంట్లు వంటివి నిర్మిస్తున్నారు. వీటికి సంబంధించి సీఆర్‌డీఏ వసూలు చేస్తున్న డెవలప్‌మెంట్ చార్జీలో స్థానిక గ్రామ పంచాయతీలకు మిగతా 6లో..

మొక్కలు నాటడం అలవాటు చేసుకోవాలి

● డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి



ఆసుపత్రికి వచ్చేవారికి మొక్కలు పంచుతున్న డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి

విజయవాడ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ప్రతి మనిషి తన జీవిత కాలంలో మొక్కలు నాటడం అలవాటుగా మార్చుకోవాలని డయాబెటిస్ స్పెషలిస్ట్ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. నగరంలోని వీజీఆర్ ఆసుపత్రిలో ఆదివారం మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవుల పరిరక్షణ జీవన వైవిధ్యాన్ని పెంపొందించేందుకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. 15ఏళ్ల నుంచి పల్లె ప్రాంతాల్లో వివిధ రకాల పండ్ల మొక్కలను నాటడం, తన వద్దకు వచ్చే పేషెంట్లకు మొక్కలు అందజేయడం చేస్తున్నామన్నారు. ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది కూడా 600 మామిడి మొక్కలు మందలపల్లి నర్సరీ నుంచి తెప్పించి ఆసుపత్రి ఆవరణలో అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. మొక్కలు పెంచాలనే ఆసక్తి ఉన్నవారు ఆసుపత్రికి వచ్చి మామిడి మొక్కలు తీసుకెళ్లవచ్చన్నారు. గ్రామ ప్రజలు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

అత్యంత క్లిష్టమైన సర్జరీ విజయవంతం

● క్యాపిటల్ ఆసుపత్రి డాక్టర్ హేమకృష్ణ సాయి


సర్జరీ తరువాత కుమారుడితో పాములు

విజయవాడ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): అత్యంత క్లిష్టమైన బడుల్ వాల్వ్ రీప్లేస్‌మెంట్‌ను 84 ఏళ్ల వృద్ధుడికి విజయవంతంగా నిర్వహించినట్టు క్యాపిటల్ ఆసుపత్రి కన్సల్టెంట్ కార్డియో థొరాసిక్ సర్జన్ డాక్టర్ కే హేమకృష్ణ సాయి తెలిపారు. ఆదివారం క్యాపిటల్ ఆసుపత్రిలో నిర్వహించిన మీడియా సమేవేశంలో ఆయన మాట్లాడుతూ ఆగిరిపల్లి మండలం తోటపల్లికి చెందిన ఆరెపల్లి పాములు రెండేళ్లుగా తీవ్రమైన డబుల్‌వాల్వ్ వ్యాధితో బాధపడుతున్నారని, దీర్ఘకాలికంగా వైద్యం చేయించుకున్నప్పటికీ పరిస్థితి దిగజారిందన్నారు. శ్వాస బలహీనంగా ఉండడం, గుండె వైఫల్యంతో రోజువారీ కార్యకలాపాలు నిర్వహించుకోలేని పరిస్థితిలో ఆసుపత్రికి వచ్చిన రోగికి సంక్లిష్టమైన ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించినట్టు తెలిపారు. సీఎం సహాయనిధి కింద ఆపరేషన్‌ను నిర్వహించామన్నారు. ఆసుపత్రి ఎండీ డాక్టర్ హరీష్ మన్నే, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

పోరాటాలతోనే హక్కులకు రక్షణ

● ఉపాధ్యాయులకు పీఆర్సీ డీఏ బకాయిలు చెల్లించాలి
● మాజీ ఎమ్మెల్సీలు లక్ష్మణరావు, నాగేశ్వరరావు

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పోరాటాలతోనే ఉపాధ్యాయులు ప్రయోజనాలు సాధించుకోవాలని, హక్కులను కాపాడుకోవాలని మాజీ ఎమ్మెల్సీలు కేఎస్ లక్ష్మణరావు, బొడ్డు నాగేశ్వరరావు అన్నారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం కృష్ణా జిల్లా యూటీఎఫ్ మధ్యంతర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పీఆర్సీ ప్రకటించలేదన్నారు. డీఏ బకాయిలను చెల్లించాలన్నారు. యాప్‌ల భారం తగ్గిస్తామన్న మంత్రి లోకేష్ హామీ నెరవేర్చలేదన్నారు. మాజీ ఎమ్మెల్యే బొడ్డు నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యాలయాలను ఇంకా ప్రైవేటీకరణ చేసేందుకు యోచిస్తున్నాయన్నారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎండీ షౌకత్ హుస్సేన్ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శుల్లు కేఏ ఉమామహేశ్వరరావు, ఎస్పీ మనోహరకుమార్‌తో పాటు యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీ కనకారావు, కోశాధికారి ఎం వరప్రసాద్, జిల్లా సహాధ్యక్షురాలు జే రూసీ, కార్యదర్శి టీ సీతారామయ్య, జిల్లా గౌరవాధ్యక్షుడు జే లెనిన్‌బాబు, సీహెచ్ రాజాశ్రీధర్, యూటీఎఫ్ జిల్లా మాజీ అధ్యక్షుడు పార్వతీశం, ఆశీర్వాదం, రాందేవ్ మాట్లాడారు. అనంతరం పీఆర్సీ నివేదికను ప్రకటించాలని, సీపీఎస్‌ను రద్దు చేసి టీచర్లను పాత విధానంలో చేర్చి పెన్షన్లు ఇవ్వాలని తీర్మానించారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన నేతలతో సమావేశం ఆద్యంతం చర్చనీయాంశంగా జరిగింది.

గౌడపాలెంలో భూముల పరిశీలన

● ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

పెడన రూరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): జింజేరు గౌడపాలెంలో ఆక్రమణలు అన్న కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ కే అనిల్‌కుమార్ సిబ్బందితో కలిసి గౌడపాలెం వెళ్లారు. శ్మశాన స్థలం, పీడబ్ల్యూడీ భూములను పరిశీలించారు. ఆక్రమణలకు గురయ్యాయన్న స్థలాలను పరిశీలించి ఆయా వివరాలను ఉన్నతాధికారులకు వివరించనున్నారు.

పిడుగుపాటుకు వ్యవసాయ కూలీ మృతి



కోడూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇరాలి గ్రామానికి చెందిన గంజాల కొండాలమ్మ (30) పిడుగుపాటుకు గురై ఆదివారం మృతి చెందింది. వ్యవసాయ పనులకు వెళ్లిన ఆమె విగత జీవిగా మారటంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో కూలి పనులు చేసుకుంటూ కొండాలమ్మ, వీరబాబు దంపతులు జీవనం సాగిస్తున్నారు. ఇద్దరు మగ పిల్లలు. కాగా రోజులానే ఆదివారం ఉదయం వ్యవసాయ పనులకు వెళ్లారు. తోటి కూలీలతో కలిసి కొండాలమ్మ కోడూరు శివారు నరసింహాపురం గ్రామ సమీపంలోని పొలానికి వెళ్లింది. ఇంతలో ఒక్కసారిగా వాతావరణం మారింది. ఉరుములు, మెరుపులతో భారీ వర్షం పడింది. అదే సమయంలో పిడుగు పడటంతో ఆ శబ్దానికి ఆమె అక్కడిక్కడే మృతి చెందింది. కొండాలమ్మ అకాల మృతిని భర్త వీరబాబు జీర్ణించుకోలేకపోతున్నాడు. ఉదయం పనికి వెళ్లిన భార్య సాయంత్రం విగతజీవిగా రావటంతో తట్టుకోలేక తన పిల్లలను హత్తుకుని భోరున విలపించాడు. ఆమెతోపాటు నాటు వేస్తున్న గంజాల జ్యోతి, గంజాల పార్వతి పిడుగు తాకిడికి గాయపడగా, వారిని ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

స్వచ్ఛ విజయవాడ సాధించుకుందాం

● ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

విద్యాధరపురం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ విజయవాడ సాధించుకుందామని, ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జీ లక్ష్మీశ అన్నారు. స్వచ్ఛ విజయవాడ సాధనలో భాగంగా జిల్లా యంత్రాంగం, వీఎంసీ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం భవానీపురం హరిత బెరం పార్క్‌లో సంప్రదాయ నృత్య పోటీలను కలెక్టర్, వీఎంసీ కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నగరంలోని ఔత్సాహిక నృత్య కళాకారులు తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించేందుకు ఇలాంటి వేదికలు దోహదపడతాయన్నారు. వీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ ఉత్పతుల నిషేధంపై ప్రజల్లో చైతన్యం పెంచేందుకు వివిధ కళారూపాలతో చేసే ప్రచారంలో భాగంగా వరుసగా ఐదు ఆదివారాలు నృత్యపోటీలు జరుగుతాయన్నారు. జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియా పాల్గొన్నారు.

రాజధానితో సమానంగా విజయవాడ అభివృద్ధి

● ఘనంగా ఎంపీ చిన్ని జన్మదిన వేడుకలు ● శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ నేతలు


ఎంపీ చిన్నిని అభినందిస్తున్న ఎమ్మెల్యేలు బొండా ఉమా, తంగిరాల సౌమ్య, కొలికపూడి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న తదితరులు

వన్‌టౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతితో సమానంగా విజయవాడ అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. ఆదివారం తన జన్మది వేడుకల సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. నగరానికి ట్రాఫిక్ సమస్యలు తీరనున్నాయన్నారు. ఎన్టీఆర్ జిల్లాలో జాతీయ రహదారి - 30లో ఇబ్రహీంపట్నం, చంద్రగూడెం మార్గంలో డబుల్ లైన్ ఆర్‌వోబీకి, విజయవాడ - మచిలీపట్నం ఆరు లైన్ల హైవేకు మంత్రి నితిన్ గడ్కరీ శంకుస్థాపన చేశారన్నారు. సీఎం చంద్రబాబు అభ్యర్థన మేరకు హైదరాబాద్ - విజయవాడ ఆరు లైన్ల గ్రీన్ హైవే ఎక్స్‌ప్రెస్‌ను విజయవాడ పున్నమిఘాట్ వరకు పొడిగించేందుకు గడ్కరీ అంగీకరించి అధికారులకు ఆదేశాలిచ్చారని తెలిపారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు చేస్తున్నట్టు తెలిపారు. తొలుత గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎంపీ పార్టీ నేతల సమక్షంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. పలువురు ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, పార్టీ సీనియర్ నేతలు ఎంపీని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేయగా, మాజీ ఎమ్మెల్సీ భారీ గజమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపీ చిన్ని మరిన్ని జన్మదిన వేడుకలు జరుపుకోవాలని, ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఎంపీకి శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, కొలికపూడి శ్రీనివాసరావు, తంగిరాల సౌమ్య, ఎంపీ సానా సతీష్, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్, ఏపీ బిల్డింగ్స్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ అడ్వయిజరీ కమిటీ చైర్మన్ జీ రఘురామరాజు, రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొప్పన భవకుమార్, వివిధ విభాగాల అధ్యక్షులు, కమిటీ ప్రతినిధులు ఉన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో ఎంపీ కుటుంబం



ఇంద్రకీలాద్రి: ఎంపీ కేశినేని చిన్ని జన్మదినం సందర్భంగా ఆదివారం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి దుర్గగుడిలో దుర్గమ్మను దర్శించుకున్నారు. ఈవో వీకే శీనానాయక్, అర్చకులు వారికి ఆలయ మర్యాదలతో సాదర స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనానంతరం వేదాశీర్వచన మండపంలో వేద పండితులు వారికి ఆశీస్సులు అందజేశారు. అనంతరం ఈవో ఎంపీ కుటుంబ సభ్యులకు అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

దివిసీమ గాంధీ.. చరిత్ర మరువదు మీ సేవా నిరతి

● మాజీ మంత్రి మండలి కృష్ణారావు శత జయంతి నేడు




అవనిగడ్డ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): దివిసీమ పేరు వినగానే ఎవరికైనా ముందుగా గుర్తుకొచ్చే పేరు దివంగత మాజీ మంత్రి మండలి వెంకట కృష్ణారావుదే. గాంధేయ వాదాన్ని రాజకీయాల్లో ప్రయోగించి ఆడంబరాలకు దూరంగా, సేవే పరమావధిగా రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగించి దివి ప్రాంత ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా స్థానం సంపాదించుకున్న గొప్ప వ్యక్తి మండలి వెంకట కృష్ణారావు. దివిసీమ ఉప్పెన అనంతరం ఈ ప్రాంత పునర్నిర్మాణానికి ఆయన చేసిన అలుపెరగని పోరాటం ప్రజల మనసుల్లో చెరగని తీపి గుర్తుగా నిలిపింది. తన జీవితాన్ని దివిసీమ అభివృద్ధికి అంకితం చేసిన మండలి కృష్ణారావు శత జయంతి నేడు. కొల్లేటి సీమలోని పల్లెవాడలో 1926 ఆగస్టు 4న జన్మించిన ఆయన నాగాయలంక మండలం భావదేవరపల్లి, అవనిగడ్డలో విద్యాభ్యాసం సాగించారు. 1957 నుంచి 62 వరకు ఎంపీగా 1963 నుంచి 1969 వరకు జడ్పీ ఉపాధ్యక్షుడిగా, 1969 నుంచి 72 వరకు అవనిగడ్డ పంచాయతీ సమితి అధ్యక్షుడిగా పని చేశారు. 1972లో అవనిగడ్డ ఎమ్మెల్యేగా ఎన్నికై పీవీ నరసింహారావు మంత్రివర్గంలో సాంఘిక సంక్షేమం, మత్స్య పరిశ్రమల శాఖలను నిర్వహించారు.

చరిత్రలో అతి పెద్ద ఉత్పాతాల్లో ఒక్కటైన దివిసీమ ఉప్పెన 1977లో దివి ప్రాంతాన్ని మరుభూమిగా మార్చగా, నాడు శవాల దిబ్బగా మారిన దివి గడ్డను తన సేవాస్ఫూర్తితో పునర్నిర్మించి విమర్శకుల ప్రశంసలు పొందారు. సేవల స్వీయ పర్యవేక్షణకు అడ్డంకిగా ఉంటుందని భావించి మంత్రి పదవికి రాజీనామా చేసి సహాయ పునరావాస కార్యక్రమాలు నిర్వహించారు.1978లో రెండోమారు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1983లో జరిగిన ఎన్నికల్లోనూ ఎన్టీఆర్ ప్రభంజానికి ఎదురొడ్డి గెలుపొందారు. దివిసీమకు ఆయన చేసి సేవలు ఇప్పటికీ ఆ ప్రాంతంలో కథలు కథలుగా చెప్పుకుంటారు. 1997 సెప్టెంబరు 27న ఆయన తుది శ్వాస విడిచారు.



కృష్ణారావు కుమారుడు, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ బాల్యం నుంచే కృష్ణారావు చేపట్టే సేవా కార్యక్రమాలు చూస్తూ పెరిగాను. ఆయన ఆశయాలకనుగుణంగానే రాజకీయాల్లోకి వచ్చి 4సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యానన్నారు. నియోజకవర్గాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రయత్నించటమే ఆయనకు తానిచ్చే నివాళి అన్నారు.



లిఖిత ఇన్‌ఫ్రా చైర్మన్ జీఎస్ రావు మాట్లాడుతూ కృష్ణారావు సేవలను బాల్యం నుంచి చూస్తూ పెరిగానని, దివిసీమ ఉప్పెనకు మరుభూమిగా మారిన ఈ ప్రాంతాన్ని పునర్నిర్మించటంతో చూపిన చొరవ, చేసిన త్యాగాలు స్ఫూర్తిని నింపాయి. ఆయన స్ఫూర్తితో ఆ ప్రాంత అభివృద్ధికి సహకారం అందిస్తానని అన్నారు.

శతాబ్ది ఉత్సవాలకు ముస్తాబు

అవనిగడ్డ రూరల్: దివంగత మాజీ మంత్రి కృష్ణారావు శత జయంతి వేడుకలు సోమవారం నుంచి మొదలు కావటంతో పులిగడ్డ టోల్‌ప్లాజా వద్దనున్న కృష్ణారావు కాంస్య విగ్రహంతోపాటు పులిగడ్డ ఇరిగేషన్ శాఖ కార్యాలయం సమీపంలోని ఆయన విగ్రహాలను గ్రామస్థుల ఆధ్వర్యంలో ఎప్పుడో ఏర్పాటు చేశారు. సోమవారం నుంచి శత జయంత్యుత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో ఈ ప్రాంతాలను సుందరంగా అలంకరించేందుకు గ్రామస్థులు సమాయత్తమయ్యారు.

సోషల్ మీడియా రాజీనామాలపై ఎమ్మెల్యే సౌమ్య ఫైర్

నందిగామ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో పార్టీకి రాజీనామాలు చేస్తున్న నేతలను ఉపేక్షించేది లేదంటూ మరో మారు ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకరిని చూసి మరొకరు తమ అసంతృప్తులను సోషల్ మీడియాలో పోస్టులు పెడితే పార్టీకి నష్టం కలుగుతుందని భావించిన ఆమె హెచ్చరికలు చేసి అడ్డుకట్ట వేసే ప్రయత్నం చేశారు. ఇటీవల అనాసాగరానికి చెందిన నీటి సంఘం అధ్యక్షుడు చలమల కృష్ణ తన పదవికి రాజీనామా చేశారు. జనసేన నేతలకిచ్చిన గౌరవం తనకు ఇవ్వడం లేదన్న ఆరోపణలతో సోషల్ మీడియాలో తన పదవికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు.ఇదే క్రమంలో తాజాగా పట్టణంలోని 18వ వార్డు పార్టీ ఇన్‌చార్జి తోటకూర సూర్యనారాయణ తన పదవికి రాజీనామా చేస్తున్నట్టు సోషల్ మీడియాలో ప్రకటించారు. ఇటీవలే వైసీపీకి చెందిన 18వ వార్డు కౌన్సిలర్ టీడీపీలో చేరారు. దీంతో కొత్తగా వచ్చిన కౌన్సిలర్ వర్గానికి పార్టీలో ప్రాధాన్యత పెరిగింది. అందుకే అవకాశం వచ్చిన ప్రతిచోటా సూర్యనారాయణ తన అసంతృప్తిని వ్యక్తం చేస్తూ వచ్చాడు. ఫలితం లేక చివరకు శనివారం సోషల్ మీడియాలో రాజీనామా ప్రకటన చేశాడు. దీనికి తోడు గతంలోనూ పలు సంఘటనలు ఎమ్మెల్యే సౌమ్యను అసహనానికి గురి చేశాయి. ముప్పాళ్లలో సీఎం చంద్రబాబు సమక్షంలో జరిగిన సమీక్షలో పలువురు నేతలు వ్యక్తపరిచిన అసంతృప్తిపై మనస్తాపానికి గురయ్యారు. తాజాగా ఆర్థిక మంత్రి పయ్యావుల పర్యటనలో సౌమ్య సమక్షంలో బీసీ నేత యలగాని నూకానమ్మ ఏకంగా బీసీలకు అన్యాయం జరుగుతుందంటూ చేసిన ప్రకటన సౌమ్యను ఒకింత అసహనానికి గురిచేసింది. ఇలా ప్రతి ఒక్కరూ ఇలాగే సోషల్ మీడియాలో రాజీనామాలు చేయడం, బహిరంగ సభల్లో అసంతృప్తిని వ్యక్తం చేయడం వంటి అంశాలపై సౌమ్య తీవ్రంగా స్పందించారు. ఇకపై ఇలాంటి చర్యలకు ఎవరైనా పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేశారు. సమస్యలుంటే మాట్లాడి పరిష్కరించుకోవాలని, ఇలా ప్రచారం చేస్తే ఉపేక్షించనని హెచ్చరించారు. మొత్తం మీద పార్టీకి నష్టం కలిగేలా ప్రవర్తిస్తున్న వారిపై సౌమ్య తన స్పష్టమైన దృక్పథాన్ని వ్యక్తం చేశారు.

అవయవదానం

(5వ పేజీ తరువాయి)

జనసైనికుడు చందు వీర వెంకట వసంత రాయలు ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, గుంటూరు రమేష్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్‌కు గురయ్యాడు. దీంతో రాయలు అవయవాలు దానం చేసేందుకు కుటుంబం ముందుకొచ్చింది. వసంత రాయలు కుమారుడు సీతారామరాజు మాట్లాడుతూ తన తండ్రి మరణానంతరం కూడా ఏదో ఒక రూపంలో.. ఎవరో ఒకరి రూపంలో వారి దేహంలో తన తండ్రి బతికే ఉంటాడన్న నమ్మకంతో అవయవదానానికి అంగీకరించామని తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సేవా స్ఫూర్తితోనే ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. డాక్టర్ అనూష మాట్లాడుతూ పుట్టెడు దుఃఖంలో కూడా అవయవదానానికి అంగీకరించిన కుటుంబ సభ్యులను అభినందించారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అవయవదానం చేసేందుకు ముందుకొచ్చిన జనసైనికుడి కుటుంబాన్ని పరామర్శించాలని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ తమను పంపారని శాసన మండలిలో ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్ తెలిపారు. ఆదివారం కుటుంబ సభ్యులను ఆస్పత్రిలో ఆయన పరామర్శించారు. తమ పార్టీ నిబద్ధత గల ఓ సైనికుడ్ని కోల్పోయిందని పవన్ కల్యాణ్ ప్రగాఢ సానుభూతి వ్యక్తపరిచినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల గురించి ఆరా తీసి, అవయవదానంపై అభినందించారన్నారు. పార్టీ తరఫున అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అనధికారానికి హోలో చెప్పేద్దాం!

(5వ పేజీ తరువాయి)

వారికి తెలిసిన వారికి దర్శనాలను సిఫార్సు చేస్తుంటారు. శరన్నవరాత్రుల్లో ఇదొక సంప్రదాయంగా మారింది. తెలుగు రాష్ట్రాల్లో ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులు, న్యాయమూర్తులు, న్యాయాధికారులు, ఐఏఎస్, ఐపీఎస్ ప్రొటోకాల్ జాబితాలో ఉంటారు. వాళ్లంతా శరన్నవరాత్రుల్లో దర్శనాలకు వస్తుంటారు. ప్రజాప్రతినిధులు, అనుచరులు, కార్యకర్తలను, అధికారులు, న్యాయాధికారులు వారి బంధువులను దర్శనాలకు పంపుతారు.

నకిలీల బెడద

ఇదంతా ఒక సమస్య అయితే నకిలీ రెండో సమస్యగా మారింది. వీఐపీలకు ఆలయ అధికారులు కొన్ని టికెట్లను ఇస్తుంటారు. వాటికి నకిలీలను తయారు చేయించి కొన్ని ముఠాలు వాటిని అధిక ధరకు అమ్ముకున్న సందర్భాలు ఉన్నాయి. స్వయంగా దర్శనాలకు వచ్చే వీఐపీలకు ప్రొటోకాల్ ఉంటుంది కాబట్టి ఆ సిఫార్సులతో వచ్చే అనధికార వీఐపీలను కట్టడి చేయడానికి ఒక నిర్ణయం తీసుకోవాలని భావించారు. ఒక్కో వీఐపీకి ఎన్ని టికెట్లు కావాలో తెలుసుకుని వాటిని ముద్రించి, వాటిపై హోలోగ్రామ్ అతికించే బాధ్యతలను అధికారులకు అప్పగించారు. ఈ టికెట్లు ఉన్న వారిని ఓం మలుపు వద్ద నుంచి వీఐపీ క్యూలోకి అనుమతించాలని నిర్ణయించారు. అదేవిధంగా టికెట్లపై హోలోగ్రామ్ ఉండడంతో చూడగానే నకిలీ టికెట్లను గుర్తించే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.

స్టాంపింగ్ దోపిడీ!

(5వ పేజీ తరువాయి)

చేయడంతో ఉన్నతాధికారులు లైసెన్స్‌డ్ రిపేరర్లు, డీలర్లతో ఉమ్మడి సమావేశం నిర్వహించారు. కాటాలు ప్రభుత్వానికి విక్రయించిన వారే రిపేర్లు, సర్వీస్ చేస్తున్నందున కాటా రిపేర్లు, సర్వీసింగ్, క్యాలిబరేట్ చేసినందుకు లైసెన్స్‌డ్ రిపేరర్లకు చెల్లించాల్సిన పనిలేదని వాదించారు. స్టాంపింగ్ చేసే ముందు జిల్లా పౌరసరఫరాల అధికారి కార్యాలయానికి సమాచారం ఇచ్చి కాటాల సర్వీస్ ప్రొవైడర్‌కు సమన్వయం చేసుకుని టెక్నీషియన్‌తో కాటా రిపేర్లు ఉంటే చేయించాలని ఆ సమావేశంలో డీలర్లు కోరారు. కాటాలు ప్రామాణికంగా ఉన్నాయా లేదా అన్న కాలిబరేషన్ కోసం ప్రభుత్వానికి రూ.300 ఫీజు ఎప్పటిలాగే చెల్లిస్తామని చెప్పారు. దీంతో వివాదానికి తెరపడింది.

సమాచారం లేదు.. సర్వీస్ ప్రొవైడర్ టెక్నీషియన్ లేడు

ఎన్టీఆర్ జిల్లాలో కాటాలకు స్టాంపింగ్ చేసేటపుడు తూనికలు, కొలతలశాఖ అధికారులు జిల్లా పౌరసరఫరాల అధికారి కార్యాలయానికి సమాచారం ఇచ్చి కాటాల సర్వీస్ ప్రొవైడర్ టెక్నీషియన్‌ను సమన్వయం చేసుకుని కాటాలకు మరమ్మతులు ఉంటే చేయించి, అపుడు సీల్ చేయాలి. కానీ, ఇటీవల మైలవరం తదితర ప్రాంతాల్లో ఇటువంటిది ఏమీ లేకుండా సీల్ వేసే కార్యక్రమం చేస్తున్నారు. పైగా ప్రతి రేషన్ డీలర్ నుంచి రూ.1000 చొప్పున వసూలు చేసి ఒకటే బిల్లు ఇస్తున్నారు. వాస్తవానికి డీలర్లు ప్రభుత్వానికి చెల్లించే రూ.300 సీఎఫ్‌యంఎస్ ద్వారా చెల్లించి రసీదును సంబంధిత అధికారికి అందజేస్తేనే . వారు వచ్చి సీల్ వేయాలి. కాని అందుకు విరుద్ధంగా మైలవరంలో గుట్టు చప్పుడు కాకుండా వ్యవహారం జరిగిపోతోంది.

పోలంపల్లి ఆనకట్ట తాత్కాలిక మరమ్మతులకు సహకరించండి

● తెలంగాణ డిప్యూటీ సీఎం విక్రమార్కను కలిసి తాతయ్య



జగ్గయ్యపేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పోలంపల్లి వద్ద మునేరు ఆనకట్ట తాత్కాలిక మరమ్మతులకు తెలంగాణలో పెద్ద మండవ రైతులను ఒప్పించాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య ఆదివారం మధిరలో కలిసి కోరారు. మునేరు ఆనకట్ట ముంపునకు గురైన పెద్దమండవ గ్రామానికి 40మంది రైతులకు త్వరలో పరిహారం ఇప్పిస్తామన్నారు. పెద్దమండవ రైతుల అభ్యంతరంతో తాత్కాలిక మరమ్మతులు ఆగి 30 వేల ఎకరాల్లో మునేరు ఆనకట్ట ఆయకట్టులో వరినాట్లు నిలిచే పరిస్థితి వస్తుందని, 50 వేల మంది రైతులు, రైతుకూలీల భవితవ్యం ప్రమాదంలో పడుతుందన్నారు. మునేరులో కలిసిపోయిన రైతుల భూములకు ఏపీ ప్రభుత్వం మార్కెట్ ధర చెల్లిస్తుందని, ఆర్థికశాఖ క్లియరెన్స్ రాగానే చెల్లిస్తామని, ఇప్పటికే కౌలు చెల్లిస్తున్నామన్నారు. ఆయనతో పాటు మునేరు ఆనకట్ట ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పొన్నం బాలాజీ, రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి కొఠారు సత్యనారాయణ ప్రసాద్, తోట నాగమల్లేశ్వరరావు, యార్లగడ్డ విశ్వనాథం, చిట్యూరి మల్లేశ్వరరావు, ఉప్పుకొండూరు గురు ప్రసాద్, అబ్బూరు వెంకటేశ్వరరావు, మల్నేడి ప్రసాద్, తోట వెంకటాద్రి, లగడపాటి శ్రీహరిరావు, బోడేపుడి శ్రీహరి ఉన్నారు.

ఎరువుల మాయం!

(5వ పేజీ తరువాయి)

ఇస్తామంటే తెలిసినవారి వద్ద ఉందని, కావాలంటే ఫోన్ చేసి చెబుతామని, అక్కడకు వెళ్లాలని బాహాటంగానే చెబుతున్నారు. జిల్లాకు ఇప్పటి వరకు ఎరువులు ఎంతమేర వచ్చాయనే విషయంపై సరైన సమాచారం వ్యవసాయశాఖ అధికారులు వెల్లడించడంలేదు.

ధరలో వ్యత్యాసం

45 కిలోల యూరియా బస్తాను రూ.266.50లకు విక్రయించాలి. హోల్‌సేల్ డీలర్లు, డీలర్లు ఎరువులను దాచేసి కృత్రిమ కొరతను సృష్టించడంతో ప్రస్తుతం బ్లాక్ మార్కెట్‌లో 45 కిలోల యూరియా బస్తాను రూ.350 నుంచి రూ.450లకు కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఇందుకు రవాణా చార్జీలు అధనం, ఈ చార్జీలు పెట్టుకోవడానికి ఇబ్బందిలేదని, అసలు ధరకన్నా అధిక ధరను నిర్ణయించి విక్రయాలు జరుపుతున్నారని రైతులు వాపోతున్నారు. వ్యాపారుల వద్ద అధిక ధరకు యూరియాను కొనుగోలు చేయలేక రైతులు ఆర్ఎస్‌కేలు, పీఏసీఎస్‌ల వద్దకు వెళితే ఎరువుల కోసం ఇండెంట్ పెట్టామని, త్వరలో స్టాక్ వస్తుందని, కబురు చేసినపుడు రావాలని చెప్పి రైతులను వెనక్కు పంపేస్తున్నారు. దీంతో వ్యాపారులు నిర్ణయించిన ధరకే యూరియాను రైతులు కొనాల్సి వస్తోంది. ఎరువుల దుకాణ యజమానులకు, వ్యవసాయశాఖ అధికారులకు ఉన్న అనుబంధం కారణంగా యూరియా, ఇతర కాంప్లెక్స్ ఎరువులను కృత్రిమ కొరత సృష్టించినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. జిల్లాలో 4.02 లక్షల ఎకరాల్లో ఈ ఖరీఫ్ సీజన్‌లో వరిసాగు జరుగుతుందని అంచనాగా ఉంది. ఇప్పటివరకు 2.40 లక్షల ఎకరాల్లో వరినాట్లు పూర్తయ్యాయి. కాలువ శివారు ప్రాంతాల్లో ఇంకా వరినాట్లు వేస్తూనే ఉన్నారు. మొదటి, రెండో కోటాల్లో కాంప్లెక్స్ ఎరువులైన డీఏపీ, 28-28, 14-36, 10-26 వంటి రకాలను చల్లుతున్నారు. కాంప్లెక్స్ ఎరువులతో పాటు ఎకరానికి కనీసంగా 25కిలోల యూరియాను కలిపి చల్లాల్సిందే.

జింక్ ప్యాకెట్ కొనుగోలు చేస్తేనే కాంప్లెక్స్ ఎరువులు

రైతులు వ్యాపారుల వద్దకు ఎరువులు కొనుగోలు చేసేందుకు వెళితే జింక్ ప్యాకెట్‌ను కొనుగోలు చేయాల్సిందేనని చెప్పి మరీ విక్రయిస్తున్నారు. డీఏపీ బస్తా రూ.1,350 ధర ఉండగా, అరకిలో జింక్ ప్యాకెట్ రూ.400 ధర పెట్టి కొనుగోలు చేయాల్సిందేనని వ్యాపారులు స్పష్టం చేస్తున్నారు. అదేమని రైతులు ప్రశ్నిస్తే జిల్లా డీలర్లు తమకు కాంప్లెక్స్ ఎరువులు విక్రయించే సమయంలో జింక్‌పాకెట్లను అంటగడుతున్నారని, వాటిని మేము ఏం చేసుకుంటామని, అందుకే మీకు విక్రయిస్తున్నామని వివరిస్తున్నారు.

యూరియా ఏమైపోయింది?

ఈ సీజన్‌లో జిల్లాలో 36 వేల టన్నుల యూరియా, 46 వేల టన్నుల కాంప్లెక్స్ ఎరువులు అవసరమవుతుందని అంచనాగా ఉంది. మార్క్‌ఫెడ్ ద్వారా డీలర్‌లకు, ఆర్ఎస్‌కేలకు యూరియా, కాంప్లెక్స్ ఎరువులను పంపామని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నా, ఇవి ఎటువైపునకు తరలిపోయాయో తెలియనిస్థితి. అత్యవసరస్థితిలో ఉపయోగించేందుకు మార్క్‌ఫెడ్ వద్ద బఫర్ గోడౌన్‌లో స్టాక్ ఉంచిన నాలుగు వేల టన్నుల ఎరువులను కూడా ఇటీవల తరలించేశారు. ఈ స్టాకు ఎటు తరలిపోయిందో కూడా తెలియనిస్థితి. ప్రస్తుతం రైతులు ఎరువులు అధికంగా వినియోగించేకాలం కావడంతో ఎరువుల కృత్రిమ కొరతను సృష్టించి వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

పంచాయతీలకు బకాయిల బండ!

(5వ పేజీ తరువాయి)

క్రమం తప్పకుండా ఇవ్వాల్సిన వాటా మొత్తాన్ని విడుదల చేయటం లేదు. దీంతో విజయవాడ గ్రేటర్ విలీన ప్రతిపాదిత గ్రామ పంచాయతీలకు రూ.100 కోట్లు పైబడి సీఆర్‌డీఏ బకాయిలు పడింది. ఈ బకాయిలు 2016 నుంచి రావాల్సి ఉంది. చూస్తుండగానే కొండలా బకాయిలు పేరుకుపోయాయి. గ్రేటర్ విలీన ప్రతిపాదిత గ్రామాల్లో ప్రధానంగా జాతీయ రహదారుల వెంబడి ఉన్న గ్రామ పంచాయతీలకు సింహభాగం డెవలప్‌మెంట్ చార్జీలను సీఆర్‌డీఏ బకాయి పడింది. ఎన్‌హెచ్ - 65 వెంబడి ఉండే గొల్లపూడి గ్రామ పంచాయతీ, ఎన్‌హెచ్ - 16 వెంబడి ఉండే రామవరప్పాడు, ఎనికేపాడు, ప్రసాదంపాడు, గూడవల్లి, కేసరపల్లి, గన్నవరం గ్రామ పంచాయతీలు, ఎన్‌హెచ్ - 30 వెంబడి ఉన్న ఇబ్రహీంపట్నం, కొండపల్లి గ్రామ పంచాయతీలకు సీఆర్‌డీఏ అత్యధిక వాటా బకాయి పడింది.


భారీ నిర్మాణాలతో పెరుగుతున్న విస్తరణ

జాతీయ రహదారుల వెంబడి ఉన్న గ్రామాల్లో నిర్మాణ రంగం మిగిలిన వాటికంటే ఎక్కువగా ఉంది. ఈ కారణం చేత భారీ గ్రూప్ హౌస్‌లు, అపార్ట్‌మెంట్లు ఏర్పడుతున్నాయి. గొల్లపూడి గ్రామ పంచాయతీలో కనీవినీ ఎరుగని రీతిలో భారీ నిర్మాణాలు వచ్చాయి. గొల్లపూడి నడిబొడ్డే కాకుండా శివారు ప్రాంతం కూడా భారీ నిర్మాణాలతో విస్తరించింది. ఈ కారణంగా ఒక్క గొల్లపూడి గ్రామపంచాయతీకే డెవలప్‌మెంట్ చార్జీల కింద సీఆర్‌డీఏ రూ. 65 కోట్ల మేర బకాయి పడింది. సింహభాగం వాటా ఒక్క గొల్లపూడి గ్రామ పంచాయతీకే బకాయి పడింది. 2016 నుంచి ఈ బకాయిలు రావాల్సి ఉంది. గొల్లపూడి మేజర్ గ్రామ పంచాయతీ కావటంతో ఆర్థిక వనరులు కలిగి ఉండటంతో ... గత పదేళ్లుగా తన పరిధిలో స్థానికంగా మౌలిక సదుపాయాలను కల్పిస్తోంది. గొల్లపూడి పంచాయతీకి ఎన్నికలు జరగకపోవటంతో .. ఫైనాన్స్ గ్రాంట్స్ కూడా రావటం లేదు. దీంతో గ్రామపంచాయతీ ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటోంది. భారీ అపార్ట్‌మెంట్లు వెలుస్తున్నా మౌలిక సదుపాయాలు కల్పించరా అంటూ పంచాయతీ అధికారులను నిలదీస్తున్నారు. బకాయిలలో కనీసం రూ. 15 కోట్లు అయినా వచ్చినా .. అత్యవసర మౌలిక సదుపాయాలు చేపట్టాలని గొల్లపూడి గ్రామ పంచాయతీ భావిస్తోంది. రామవరప్పాడు, ఎనికేపాడు, ప్రసాదంపాడు, గూడవల్లి, గన్నవరం ప్రాంతాలకు కలిపి రూ.10 కోట్ల మేర బకాయిలు రావాల్సి ఉందని తెలుస్తోంది. ఈ విషయం గ్రామ పంచాయతీల పాలకవర్గాలు కలెక్టర్ లక్ష్మీశ దృష్టికి ఇటీవల తీసుకువచ్చాయి. గ్రామ పంచాయతీలకు బకాయిలు ఉన్న డబ్బులను తక్షణం విడుదల చేయాల్సిందిగా సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబుకు కలెక్టర్ లక్ష్మీశ లేఖ రాశారు. సీఆర్‌డీఏ నుంచి బకాయిలు వస్తాయేమోనని గ్రామ పంచాయతీలు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నాయి.

రిజిస్ట్రేషన్ శాఖ నుంచి ట్రాన్స్‌ఫర్ డ్యూటీ నిల్

గ్రామ పంచాయతీ పరిధిలోని ఆస్తులకు సంబంధించి జరిగిన రిజిస్ట్రేషన్లకు ట్రాన్స్‌ఫర్ డ్యూటీ (టీడీ) కూడా ఇప్పటి వరకు ఏ పంచాయతీలకు జమ కావటం లేదు. గొల్లపూడి మేజర్ గ్రామ పంచాయతీకి రూ.2.50 కోట్ల మేర టీడీ బకాయిలు రావాల్సి ఉన్నాయి. మిగిలిన గ్రామ పంచాయతీలకు కూడా రూ.కోట్లలో కాకపోయినా రూ. లక్షలలోనైనా రావాల్సి ఉంది.

సమస్యలను ఎలా పరిష్కరించగలం



మా గ్రామ పంచాయతీ పరిధిలో నిర్మాణ రంగం పతాక స్థాయిలో ఉంది. సీఆర్‌డీఏకు పెద్ద మొత్తంలో డెవలప్‌మెంట్ చార్జీల రూపేణా ఆదాయం వస్తోంది. గ్రామ పంచాయతీకి ఇవ్వాల్సిన డెవలప్‌మెంట్ చార్జీలు కూడా ఇవ్వటం లేదు. ఎప్పటి నుంచో ఈ డబ్బులను ఇవ్వమని అడుగుతున్నా స్పందన లేదు. రూ. 65 కోట్ల మేర బకాయిలు ఉన్నాయి. గ్రామంలో ఏం చేయాలన్నా.. చేయలేకపోతున్నాం. జాతీయ రహదారి వెంబడి ఉండటం వల్ల వాటి పారిశుద్య నిర్వహణ అంతా కూడా ఆయా పంచాయతీలే నిర్వహిస్తున్నాయి. పంచాయతీల పరిధిలో ఎన్నో సమస్యలుంటాయి. ఆ సమస్యలను పరిష్కరించాలంటే డబ్బులు కావాలి. మా పంచాయతీ ఉత్తమ అవార్డు సాధించింది. ఇలాంటి పంచాయతీని నిర్లక్ష్యంగా వదిలేస్తే మాకే చెడ్డపేరు వస్తుంది. ఉత్తమ పంచాయతీకైనా బకాయిలు ఇవ్వాలనిపించటం లేదు. ప్రభుత్వం మా బాధను అర్థం చేసుకుని సీఆర్‌డీఏ నుంచి బకాయిలను ఇప్పించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం.

- బొమ్మసాని సుబ్బారావు, గొల్లపూడి గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	105, 113, 124
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 475

కొనసాగుతున్న లక్ష్మీ తిరుపతమ్మ గ్రామోత్సవం



గన్నవరం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : శ్రీలక్ష్మీతిరుపతమ్మ సమేత గోపయ్య ఉత్సవమూర్తుల గ్రామోత్సవం ఘనంగా జరుగుతుంది. ఈ నెల 1న పాత గన్నవరంలోని దేవస్థానంలో జరిగిన శ్రావణమాస సంబరాలు అనంతరం అమ్మవారు గ్రామోత్సవానికి బయలుదేరారు. ఆదివారం స్థానిక బుద్దవరం రోడ్డు, గౌడపేట, యాదవులపేట, చెంచుల కాలనీ, సగర పేట, గాజుల బజార్, రజకుల పేటలో అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవమూర్తులు సోమవారం ఉదయం ఆలయ ప్రవేశం చేస్తారని ఆలయ కమిటీ అధ్యక్షులు జాస్తి శ్రీధర్ తెలిపారు.

ఇన్‌-చార్జులే దిక్కు!

- ఉయ్యూరు నగర పంచాయతీలో ఖాళీగా కమిషనర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇతర పోస్టులు
- పనులు జరగక ఇబ్బంది పడుతున్న ప్రజలు
- మరోవైపు పనుల భారంతో తలలు పట్టుకుంటున్న ఉద్యోగులు





ఉయ్యూరు నగర పంచాయతీ కార్యాలయం.. ఖాళీగా ఉన్న కమిషనర్ సీటు

(ఉయ్యూరు - ఆంధ్రజ్యోతి)

ఉయ్యూరు నగర పంచాయతీలో కమిషనర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌తో పాటు ఇతర పోస్టులు రోజుల తరబడి ఖాళీగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జూన్ వరకు కమిషనర్‌గా పనిచేసిన వి.వెంకటేశ్వరరావు జూన్ 30న ఉద్యోగ విరమణ చేయగా, శానిటరీ అసిస్టెంట్ బదిలీపై వెళ్లారు. వీరితోపాటు రెవెన్యూ అసిస్టెంట్‌గా పని చేసిన వ్యక్తి పలు కారణాలతో దాదాపు రెండు నెలల క్రితం సస్పెండ్ అవ్వగా, మరికొన్ని పోస్టులు ఎప్పటి నుంచో ఖాళీగా ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో కమిషనర్ ఉద్యోగి విరమణతో ఎఫ్ఏసీ కమిషనర్‌గా ఎన్విరాల్ మెంటల్ అసిస్టెంట్ ఇంజనీర్‌కు బాధ్యతలు అప్పగించారు. అదే విధంగా వార్డు సచివాలయ శానిటేషన్ సెక్రటరీకి శానిటేషన్ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు అప్పగించారు. చార్జ్ బాధ్యతలు అప్పగించడం వల్ల ఏ విభాగానికి సరైన సమయం కేటాయించలేక ఉద్యోగులు అవస్థలు పడుతుండగా, అధికారుల పర్యవేక్షణ కొరవడి సత్వర సేవలందక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కమిషనర్ రిటైర్ అయి నెల రోజులు కావస్తున్నా కొత్తకమిషనర్‌ను నియమించకపోవడం పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తనకు అనూకూలంగా ఉండే వారి కోసం ఛైర్మన్ గట్టిగా ప్రయత్నిస్తున్నట్టు సమాచారం కాగా ఎమ్మెల్యే ఈ విషయంలో ఆలోచించి నిర్ణయం తీసుకుంటారని పార్టీ వర్గాల సమాచారం.

ఐదుగురు జూదరుల అరెస్టు

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పేకాడుతున్న జూదరులపై ఎస్సై వి. సురేష్ తన సిబ్బందితో ఆదివారం దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేశారు. స్థానిక తారకరామ నగర్ సమీపంలోని పామాయిల్ తోటలో జూదం ఆడుతున్నట్లు సమాచారం అందడంతో ఎస్సై దాడి చేశారు. నిందితులపై కేసు నమోదు చేసి వారి వద్ద రూ. 6,400 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

నేడు విద్యుత్ నిలిపివేత

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కానుమోలు-గుణదల, గుణదల -రంగన్నగూడెం లైన్స్‌లో 132 కేవీ కొత్త ఇన్‌లైన్ నిర్మాణం పనులు గత నెల 31నుండి నిర్వహిస్తున్న నేపథ్యంలో అత్యవసర పరిస్థితి ఏర్పడితే సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని జంక్షన్ విద్యుత్ సబ్‌డివిజన్ డీఈఈ బి.శ్రీనివాసరావు ఆదివారం ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సరఫరా నిలిపివేయాల్సిన అత్యవసర పరిస్థితి ఏర్పడితే 132కేవీ రంగన్నగూడెం, 132కేవీ కానుమోలు సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రాంతాలకు ఉదయం 7నుంచి సాయంత్రం 6 గంటలు వరకు అంతరాయం ఏర్పడుతుందని ప్రజలు గమనించాలని విజ్ఞప్తి చేశారు.

పెనమలూరు అంకమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు

పెనమలూరు ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం సందర్భంగా పెనమలూరు, పోరంకి తదితర గ్రామాల నాయీబ్రాహ్మణులు ఆకునూరు అంకమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి పొంగళ్లు, నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు ఆకునూరు సుబ్బారావు మాట్లాడుతూ, శ్రావణమాసంలో ప్రతియేటా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆకునూరు బసవరాజు, శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, రమేష్, వీ మారుతీ సురేష్, మద్దిరాల వెంకటసుబ్బారావు, తెన్నేటి ప్రకాష్, పరస బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను త్వరలోనే పరిష్కరిస్తాం

ఎమ్మెల్యే బోడె ప్రసాద్





కాసరనేనివారి పాలెంలో పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్.. యనమలకుదురులో రోడ్లు, డ్రెయిన్లకు శంకుస్థాపనలో..

పెనమలూరు, ఆగస్టు3 (ఆంధ్రజ్యోతి): యనమలకుదురులో ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న తాగునీటి సమస్యకు పరిష్కారం కనుగొంటామని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ హామీ ఇచ్చారు. ఆదివారం యనమలకుదురు వినాయకనగర్‌లో రెండు కోట్ల వ్యయ అంచనాతో నిర్మించ తలపెట్టిన రోడ్లు, డ్రెయిన్ల శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తాడిగడప మునిసిపాలిటీని గత పాలకులు తమ స్వార్థం కోసం ఉపయోగించుకున్నారే తప్ప ఎటువంటి అభివృద్ధి పనులు చేయలేకపోయారన్నారు. తాను అధికారంలోకి రాగానే యనమలకుదురు వంతెన, వీఆర్ సిద్ధార్థ వంతెనలను వెనువెంటనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చామన్నారు.

అనుమోలు సేవలు అభినందనీయం ..

స్థానికంగా ఎంతో మందికి కొన్ని సంవత్సరాలుగా ఉచిత వైద్యసేవలు అందిస్తున్న అనుమోలు ఆదరణ ట్రస్టు సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. ఆదివారం పోరంకి టీడీపీ కార్యాలయంలో పోరంకి క్యాపిటల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై వైద్య సేవలను పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అనుమోలు ఆదరణ ట్రస్టు ఛైర్మన్ అనుమోలు ప్రభాకరరావును ఆదర్శంగా తీసుకొని పేదలకు వైద్య సహాయాన్ని అందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలోగద్దె ఆర్తి, అనుమోలు సురేష్, గద్దె ధీరజ్, అనుమోలు రిషి, గద్దెహేమలత, కోలా ప్రసాద్, బొంగరాల అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన పాలన అందించాలి..

కంకిపాడు : ప్రజలకు మెరుగైన, నాణ్యమైన పాలన అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేప డుతున్నామని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. మండలంలోని కాసరనేనివారి పాలెంలో రూ. 15 లక్షతో నిర్మించనున్న పంచాయతీ భవనానికి ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పంచాయతీ భవనాన్ని రూ. 15 లక్షలతో నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గొంది శివరామకృష్ణ ప్రసాద్, సర్పంచ్ పెద్ది ప్రసాద్, చిప్పల రామదాసు, ఎంపీటీసీ ఒడుగు శ్రీనివాసరావు, నెక్కలపూడి బాబి, తీట్ల మధు, జనసేన నాయకులు పులి కామేశ్వరరావు, ముప్పా రాజ పాల్గొన్నారు.



కంటి వైద్య శిబిరాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న అతిథులు

మెగా కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన

పెనమలూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ యువనేత బోడె వెంకట్రామ్ , శంకర కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం కానూరులో నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్యశిబిరానికి షుమారు 550 మందికి పైగా స్థానికులు, వృద్ధులు హాజరై కంటి వైద్య పరీక్షలు చేయించుకొన్నారు. 33వ డివిజన్ అధ్యక్షుడు సుంకర సాయి అధ్యక్షతన జరిగిన ఈ కంటి వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే బోడె సతీమణి హేమచౌదరి, టీడీపీ సీనియర్ నాయకులు బొప్పన భవకుమార్, బోడె వెంకట్రామ్‌లు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. శంకర ఐ ఫౌండేషన్ వైద్యులు డాక్టర్ చరిత, డాక్టర్ తన్మయి కంటి పరీక్షలతో పాటు షుగర్, బీపీ, శుక్లాల పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగురైతు సంఘం సభ్యులు గద్దె ప్రసాద్, తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్ర, దోనేపూడి రవికిరణ్, ద్రోణవల్లి సుబ్బారావు, టీడీపీ రెహమాన్, కోసూరి రమేష్, కొమ్మిన పండు, గుమ్మడి సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు అపహరణ



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

ఉంగుటూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : ఒంటరిగా వున్న ఓ వృద్ధురాలి మెడలో నుంచి ఓ దుండగుడు బంగారు గొలుసును అపహరించుకుపోయిన ఘటన ఆదివారం ఉంగుటూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని వెన్నూతలలో జరిగింది. ఎస్సై యు.గోవిందు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బొమ్మి సింహాచలం (70)అనే వృద్ధురాలు సొంత ఇంట్లో వెనుకగదిలో నివాసముంటోంది. ముందుగదిలో చిన్నకుమారుడైన బొమ్మి కరుణాకరరావు, భార్యా పిల్లలతో కలిసి వుంటున్నాడు. పెద్దకుమారుడు వెంకట్రావు తమ్ముడు కరుణాకరరావుతో కలిసి శనివారం గుంటూరు ఆసుపత్రికి వెళ్లాడు. కరుణాకరరావు భార్య, పిల్లలతో కలిసి పుట్టినింటికి (ఉంగుటూరు)వెళ్లింది. ఇదే అవకాశంగా భావించిన దుండగుడు ఆదివారం తెల్లవారుజామున ముందుగదికి వేసిన తాళం పగలగొడుతుండగా ఆ అలికిడికి వెనుకగదిలోనుంచి వృద్ధురాలు బయటకు వచ్చింది. దీంతో వృద్ధురాలిపై దాడికి తెగబడ్డ దుండగుడు కత్తితో బెదిరించి ఆమె మెడలోని సుమారు రెండున్నర లక్షలు విలువగల మూడుకాసుల బంగారు నానుతాడును లాక్కొని పరారయ్యాడు. వృద్ధురాలు ఉంగుటూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. గన్నవరం సీఐ బీవీ శివప్రసాద్ నేతృత్వంలో ఉంగుటూరు ఎస్సై యు.గోవిందు, ట్రైనింగ్ ఎస్సై సూర్యప్రకాష్‌లు క్లూస్‌టీంను రప్పించి ఆధారాలు సేకరించారు.



ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు

జిల్లా హెచ్‌ఎంల సంఘం ఎన్నిక ఏకగ్రీవం

ఉయ్యూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘ ఎన్నికలు ఆదివారం ఉయ్యూరు జడ్పీ హైస్కూల్ ఆవరణలో ఆదివారం నిర్వహిచారు. జిల్లా ప్రధానోపాధ్యాయుల కౌన్సిల్ సమావేశంతో పాటు 2025-27 సంవత్సారాలకు జిల్లా కార్యవర్గ సభ్యుల ఎన్నికకు జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా హెచ్‌ఎంల సంఘ అధ్యక్షుడిగా వైఎస్ఎన్ ప్రసాద్(తాడంకి), ప్రధాన కార్యదర్శిగా కొమ్మా విజయ్(వేలేరు), కోశాధికారిగా కేబీఎస్‌శర్మ(పురిటిగడ్డ), గౌరవ అధ్యక్షుడిగా కె.జగదీశ్వరావు(గొల్లనపల్లి) ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రాష్ట్ర పరిశీలకుడు ఎస్.వి.రమణ, ఎన్నికల పరిశీలకుడు కేశవరావు తెలిపారు. రాష్ట్ర కౌన్సిలర్లుగా డేవిడ్ రత్నరాజు(ఎంఈఓ-2 నందివాడ), మోమిన్ (ఎంఈఓ-2 ఘంటసాల), సుబ్రహ్మణ్యం (హెచ్‌ఎం గొడవర్రు) ఎన్నిక య్యారు. మచిలీపట్నం డివిజన్ అధ్యక్షుడుగా ఎ.వి.రమణ (పెదప్రోలు), కార్యదర్శిగా చంద్రశేఖర్, ఉయ్యూరు డివిజన్ అధ్యక్షుడిగా నాగేశ్వరరావు (ఉయ్యూరు), కార్యదర్శిగా శ్రీనివాస్ (అగ్నిపర్రు), గుడివాడ డివిజన్ అధ్యక్షుడిగా సురేష్ (ఎంఈఓ-2 పెదపారుపూడి), కార్యదర్శిగా జగన్‌మోహన్‌రావు (ఎంఈఓ-1 గుడ్లవల్లేరు), జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా వెంకటేశ్వరరావు (ఎంఈఓ-1 తోట్లవల్లూరు), శ్రీధర్(తరకటూరు) మున్సిపల్ స్కూల్ ప్రతినిధిగా శోభారాణి(రాజుపేట, బందరు), ఎయిడెడ్ స్కూల్ ప్రతినిధిగా సూర్యనారాయణ (జైహింద్ స్కూల్ బందరు) ఎన్నికైనట్లు పరిశీలకులు వివరించారు.

ఘనంగా కాకాని జయంతి

ఉయ్యూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి కాకాని వెంకరత్నం జయంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆకునూరులో కాకాని విగ్రహానికి ఏఎంసీ ఛైర్మన్ కొండా ప్రవీణ్, సర్పంచ్ గోలి వసంతకుమార్, టీడీపీ గ్రామ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మంత్రిగా రాష్ట్రానికి, జిల్లాకు విశేష సేవలందించి ఉక్కు కాకానిగా పేరొందిన మహానాయకుడు కాకాని వెంకటరత్నం అని కీర్తించారు.



కాకాని విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఏఎంసీ ఛైర్మన్ ప్రవీణ్, సర్పంచ్ వసంతకుమార్



ఉయ్యూరు 20వ వార్డులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో వైవీబీ, స్థానిక కూటమి నాయకులు

ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్న ప్రభుత్వం

ఉయ్యూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : సూపర్ సిక్స్ పథకాలు ఒక్కొక్కటి అమలు చేస్తూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టు కుంటుందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉయ్యూరు 20వ వార్డులో పర్యటించి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు ఇంటింటా ప్రచారంచేశారు. మాజీ ఛైర్మన్ ఖుద్దూస్, కూపరెడ్డి వాసు గుర్నాధరావు, అప్పలనాయుడు, చిరంజీవి, కుటుంబరావు పాల్గొన్నారు.
● తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి ఆధ్వర్యంలో కలవపాములలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. గంటా పూర్ణ, మురళీమోహన్, పండు, చినకోటయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహ నిర్మాణానికి శంకుస్థాపన



కంకిపాడు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ ఆవిర్భావంతోనే బడుగు, బలహీన వర్గాల ప్రజలు రాజకీయంగా అభివృద్ధి చెందారని ఎమ్మెల్యే తనయుడు బోడె వెంకట్రామ్ అన్నారు. మండలంలోని ప్రొద్దుటూరులో టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ సీఎం ఎన్టీఆర్ విగ్రహ నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపనను టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణతో కలిసి చేశారు. కూటమి నాయకులు ఈడా కోటేశ్వరరావు, యార్లగడ్డ ఫణి, పావనమూర్తి, పలగాని శివశంకర్, మరీదు రామారావు, సతీష్, నాంచారయ్య, శివయ్య, రాంబాబు, వెంకటేశ్వరరావు, వీరాస్వామి, నాని, మైనం ప్రసాద్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పిన్నమనేనిలో ఆరోగ్య అవగాహన ప్రదర్శన



ఎగ్జిబిషన్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీజీ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవి రామోజీరావు

గన్నవరం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): సిద్ధార్థ అకాడమి పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యనందిస్తూ వారి జీవితానికి బంగారు బాటలు వేస్తుందని డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు అన్నారు. సిద్ధార్థ అకాడమి స్థాపించి 50 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్‌లో భాగంగా మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో, డాక్టర్స్ సుధా అండ్ నాగేశ్వరరావు దంత వైద్య కళాశాలలో 4 నుంచి 10వ తేదీ వరకూ జరుగనున్న ఆరోగ్య అవగాహన ప్రదర్శన ఏర్పాట్లను ఆదివారం పరిశీలించారు. డైరెక్టర్ డాక్టర్ సీవీ రావు, ప్రిన్సిపాల్ ఎంవీ భీమేశ్వర్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.అనిల్‌కుమార్, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.కళ్యాణి శ్రీ, డాక్టర్ రాజగోపాల్ సూరపనేని, డెంటల్ కళాశాల ప్రిన్సి పాల్ డాక్టర్ ఎంవీరామోజీరావు, హెచ్‌వోడీలు ఎ.కాశేశ్వరరావు, అజయ్ బెనర్జీ పాల్గొన్నారు.

మల్లవల్లి పీఏసీఎస్ సీఈవో జోజి మృతి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : మల్లవల్లి పీఏసీఎస్ ద్వారా రైతులకు అందుబాటులో ఉంటూ సేవలందించిన వణుకూరి జోజి (55) అనారోగ్య కారణాలతో ఆదివారం మృతి చెందారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. అందరితో కలుపుగోలుగా ఉంటూ మల్లవల్లి సర్పంచ్‌గా (2007-2012) కూడా బాధ్యతలు నిర్వహించారు. జోజి భౌతికకాయానికి టీడీపీ అధ్యక్షుడు అక్కినేని ధర్మరాజు, మల్లవల్లి పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ జాన్‌బాషా, అక్కినేని కృష్ణాజీ, మాజీ సర్పంచ్ యనమదల వెంకయ్యారావు, వేలేరు పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ అవిర్నేని భవానిశంకర్, వేములపల్లి శ్రీనివాసరావు,తదితరులు నివాళులర్పించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	105, 113, 124
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 475

కొండాలమ్మకు వెండి కిరీటం బహూకరణ

గుడ్లవల్లేరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : వేమవరం కొండాలమ్మ అమ్మవారి ఆలయంలో కాకినాడకు చెందిన భక్తులు పిల్లి శ్రీనివాసులు,సంధ్య దంపతులు, వారి బిడ్డ విహితలు రూ.1.40 లక్షల విలువ గల వెండి కిరీటాన్ని అమ్మవారికి కానుకగా సమర్పించారని ఆలయ కార్యనిర్వహణాధికారి కొండలరావు తెలిపారు. దాతలైన భక్తులను ఆలయ సంప్రదాయం ప్రకారం సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. ఆదివారం సుమారు ఇరవై వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని కొండలరావు తెలిపారు.


వెండి కిరీటం బహుకరిస్తున్న శ్రీనివాసు కుటుంబ సభ్యులు

కేంద్రమంత్రి గడ్కరీ చిత్రపటానికి పాలాభిషేకం

పెద పారుపూడి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): భూషణగుళ్లలో బీజేపీ జాతీయ మాజీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ చిత్రపటానికి బీజేపీ దళిత మోర్చా జిల్లా నాయకులు దొండపాటి శివాజీ ఆధ్వర్యంలో ఆదివారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ గుడివాడ నుంచి పెదపారుపూడి మీదుగా కంకిపాడు వరకు హైవే రోడ్డు మార్గం నిర్మించేందుకు, గుడివాడ 216 హైవేని కలుపుతూ రింగ్ రోడ్డు నిర్మాణం కోసం నిధులు వెచ్చించినందుకుగాను ఆయన ధన్యవాదాలు తెలిపారు.


పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నేతలు

శివారు భూములకు సాగునీరందించాలి

● జలవనరుల శాఖ చీఫ్ ఇంజనీర్ బి. రాంబాబు

పామర్రు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో సరైన వర్షాపాతం నమోదుకాక పోవడంతో కృష్ణాడెల్టా కింద సాగుచేస్తున్న చివరి ఆయుకట్టు భూములకు అవసరమైన సాగు నీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురౌతున్నాయని జలవనరుల శాఖ చీఫ్ ఇంజనీరు బి. రాంబాబు అన్నారు. ఆదివారం జిల్లా పర్యటనలో భాగంగా పామర్రు పరిధిలోని బల్లిపర్రులాకుల వద్ద నీటి సాంద్రతను సంబంధితశాఖ అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ వ్యవసాయసాగుకు అవసరమైన వర్షపాతం నమోదు కాకపోవడంతో వల్ల ప్రస్తుతం ఉన్న జలాశయాల నుంచి పూర్తిగా నీటిని విడుదల చేశామన్నారు. అయినప్పటికి ఆనీరు చివరి ప్రాంత ఆయకట్టు భూములకు అందకపోవడం గుర్తించామన్నారు. సాధారణంగా సాగుకు వర్షపు నీరు 60శాతం, జలాశయాలనుంచి మిగిలిన 40శాతం నీటిపై వ్యవసాయ రంగం ఆధారపడి ఉంటుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వరుణుడు కనికరించకపోవడం వల్లే రైతులకు ఇబ్బందులు ఉత్పన్నమైనట్టు చెప్పారు. ప్రస్తుతం ప్రకాశం బ్యారేజ్‌లో ఉన్న నీటిని వృథాకాకుండా అరికట్టేందుకుగాను ప్రకాశం బ్యారేజ్ వరద గెట్లన్నిటినీ మూసివేయడం కోసం ఆదేశాలిచ్చామన్నారు. రైతుల అవసరం మేరకు వంతులవారి పద్ధతిలో సాగు నీటి వినియోగానికి రైతులంతా సహకరించుకుని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. గుడ్లవల్లేరు, బంటుమిల్లి లాకులను పరిశీలించామన్నారు. ఉమ్మడిజిల్లా జలావనరులశాఖ సూపరింటెండెంట్ ఇంజనీరు ఆర్. మోహనరావు, ఈఈ రవికిరణ్, డీఈఈ పి.భరత్, పామర్రు ఏఈ ఎం.అరుణ్‌కుమార్, గుడ్లవల్లేరు ఏఈ నిర్మలా సరోజ, నిడుమోలు ఏఈఈ సాధిక్, పాల్గొన్నారు.


బల్లిపర్రులాకు వద్ద నీటి సాంద్రతను పరిశీలిస్తున్న ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ రాంబాబు

కూచిపూడి పంచాయతీ కార్యదర్శిగా హనుమాన్‌గౌడ్



కూచిపూడి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కూచిపూడి, నిడమోలు గ్రామపంచాయతీల కార్యదర్శిగా మంత్రిపాలెం గ్రేడ్-1 కార్యదర్శిగా కొనసాగుతున్న హనుమాన్ గౌడ్‌ను పూర్తి అదనపు బాధ్యతలతో నియమిస్తూ గుడివాడ డీఎల్‌పీవో జి.సంపత్ కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. మొవ్వ కార్యదర్శి (గ్రేడ్-1)గా కొనసాగుతున్న కెవి.సోమేశ్వరరావును పెదముత్తేవి కార్యదర్శిగానూ, పెడసనగల్లు కార్యదర్శి (గ్రేడ్-3)గా కొనసాగుతున్న వి.ప్రభుకుమార్‌ను పెదపూడి, భట్లపెనుమర్రు కార్యదర్శిగానూ, కాజ కార్యదర్శి గ్రేడ్-1 పి.రాంబాబును అయ్యంకి కార్యదర్శిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ డీఎల్‌పీవో ఉత్తర్వులు జారీ చేశారు.

గ్రామాల అభివృద్ధే బీజేపీ లక్ష్యం


సమావేశంలో మాట్లాడుతున్న తాతినేని శ్రీరామ్

గుడివాడ రూరల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు తాతినేని శ్రీరామ్ అన్నారు. ఆదివారం మండలంలోని సిద్ధాంతంలో మండల పార్టీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సందర్భంగా తాతినేని మాట్లాడుతూ ప్రతి గ్రామం సస్యశ్యామలంగా ఉండాలనే లక్ష్యంతో బీజేపీ ప్రణాళికలు సిద్ధం చేస్తుందన్నారు. త్వరలోనే పూర్తిస్థాయిలో కమిటీలను నియమించి పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు పార్టీపరంగా న్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు. అనంతరం జిల్లా అధ్యక్షులు తాతినేనిశ్రీరామ్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో మచిలీపట్నం పార్లమెంట్ కన్వీనర్ సూరే గాంధీ. జిల్లా ప్రధాన కార్యదర్శి అంగడాల సతీష్, మండల అధ్యక్షులు దివి తేజ మాణిక్యం, నాయకులు శీలం శంకర్రావు, మేక శ్రీనివాసు, సుబ్రహ్మణ్యశాస్త్రి. రవికుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇళ్లకు స్మార్ట్‌మీటర్లు బిగించొద్దు

● రేపాని కొండ

గుడివాడ, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి) : ఇళ్లకు బలవంతంగా స్మార్ట్‌మీటర్‌లను బిగించడం దారుణమని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు రేపాని కొండ తెలిపారు. ఆదివారం స్థానిక ధనియాలపేటలో ధర్నా విజయవంతం కోరుతూ ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ స్మార్ట్ మీటర్లను పేదలు తమ పూర్తిగా వ్యతిరేకిస్తున్నారని, భారీగా పెరిగే విద్యుత్ బిల్లులను భరించే పరిసితుల్లో పేదలు లేరన్నారు. స్మార్ట్‌మీటర్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా ప్రజాసంఘాలు ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్ శాఖ ఈఈ కార్యాలయం వద్ద ఈ నెల 5వ తేదీన జరిగే ధర్నాను విజయవంతం చేయలని ఆయన కోరారు. మూడెడ్ల నారాయణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సమరం, రవి పాల్గొన్నారు.


కరపత్రాలను పంపిణీ చేస్తున్న సీపీఎం నాయకులు

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

గుడ్లవల్లేరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : ఏఏఎన్ఎం అండ్ వీవీఆర్ఎస్ఆర్ గుడ్లవల్లేరు ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ 2017- 18 సంవత్సర పదవతరగతి బ్యాచ్ పాఠశాల పూర్వ విద్యార్థుల, ఉపాధ్యాయుల అపూర్వ సమ్మేళనం ఆదివారం ఘనంగా పాఠశాలలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాఠశాల పూర్వ విద్యార్థి హైదరాబాద్ ఐసీఐసీఐ బ్యాంక్ డిప్యూటీ మేనేజరు బూబత్తిన సాయిధనూష పాల్గొన్నారు. ప్రస్తుత విద్యార్థులకు పలు సూచనలు సలహాలను సాయిధనూష ఇచ్చారు. అనంతరం పూర్వవిద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులు ఉపాధ్యాయులు ఆమెను సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కుంజుమన్, వైస్ ప్రిన్సిపాల్ జీఎం సత్తిబాబు, పూర్వ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సాయి ధనూషను సన్మానిస్తున్న పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు

మద్యం మత్తులో మున్సిపల్ సిబ్బంది

గుడివాడ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం పక్కనే ఉన్న మున్సిపల్ వాహనాల షెడ్డులో మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది, మున్సిపల్ ట్రాక్టర్ డ్రైవర్లు శనివారం అర్ధరాత్రి మందుతో చిందేశారు. ప్రభుత్వ స్థలాన్ని తమ జాగీరుగా చేసుకుని మద్యం, బీరు బాటిళ్లతో పార్టీ చేసుకున్నారు. కుర్చీలు, టేబుళ్లతో సరంజామా సిద్ధం చేసుకున్నారు. ఆరుగురు సిబ్బంది మద్యం మత్తులో ఫోటోలు తీయడానికి వచ్చిన వారిని నోటికి వచ్చినట్లు తూలనాడారు. ఎవరు ఏమి చేయలేరని ధీమా వ్యక్తం చేశారు.

చర్యలు తీసుకుంటా

● మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్

మున్సిపాల్టీకి చెందిన వాహనాల షెడ్డులో సిబ్బంది మద్యం సేవిస్తున్నట్టు తన దృష్టికి వచ్చింది. విచారణ చేపట్టి వారిపై చర్యలు తీసుకుంటా.

ఘనంగా కనకదుర్గ, గంగానమ్మ జాతరలు


భట్లపెనుమర్రులో గంగానమ్మ ఊరేగింపు

కూచిపూడి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): భట్లపెనుమర్రు శివారు మల్లిఖార్జునపురంలో గంగానమ్మ అమ్మవారి జాతర మహోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఘటం కుండలు, పోతురాజు గెడలతో మేళతాళాలు, డప్పువిన్యాసాల నడుమ ఊరేగింపు నిర్వహించారు. భక్తులు గొర్రెపోతులతో మొక్కుబడులు చెల్లించుకుని ప్రత్యేక పూజలు అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కారకంపాడులోనూ గంగానమ్మ జాతర వేడుకలు జరిగాయి.

గుడ్లవల్లేరు : కూరాడలో కనకదుర్గ అమ్మవారి సంబరాలను ఆదివారం భక్తిశ్రద్ధలతో భక్తులు నిర్వహించారు. కూరడలోని లాకుదిగువ, గుడ్లవల్లేరుల్లో అమ్మవారి ప్రభబండి ఊరేగించి కనకదుర్గ అమ్మవారి ఆలయానికి చేరి ప్రత్యేక పూజలు అందుకున్నారు. భక్తులు అమ్మవారి ప్రభకు పశుపు నీరు వారబోసి కొబ్బరికాయలు కొట్టి, హారతులు ఇచ్చారు.

గుడివాడ : స్థానిక బేతవోలు నిమ్మతోటలో బేతవోలు యువత ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన శ్రీగంగానమ్మ సంబరాల్లో జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీనివాసరావు, త్రినాథ్, రాజేష్, పూర్ణ పాల్గొన్నారు.


కూరాడలో కనకదుర్గ అమ్మవారి సంబరాలు

కోడిపందేల రాయుళ్ల అరెస్టు

● రూ.3,100 స్వాధీనం

గుడివాడ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నీలకంఠం వారి వీధిలో ఆదివారం రాత్రి కోడిపందాలు నిర్వహిస్తున్నట్టు వచ్చిన సమాచారం మేరకు వన్‌టౌన్ సీఐ కొండపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేసి ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. రెండు కోళ్లు, రెండు కోడి కత్తులు, రూ.3,100ల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిలో ఎస్సై వి.శేషుకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	105, 113, 124
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 475





కారు ఢీకొని సంగమూడి వాసి దుర్మరణం

కృత్తివెన్ను, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : కారు ఢీకొని సంగమూడికి చెందిన వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం కృత్తివెన్నులో జరిగింది. సంగమూడి గ్రామానికి చెందిన కూనసాని వీర నారాయణస్వామి (55) కృత్తివెన్నులో చర్చికి వెళ్లి అక్కడ నుంచి సైకిల్‌పై ఇంటికి వెళ్తుండగా కృత్తివెన్ను ప్రధాన సెంటర్‌లో పల్లెపాలెం వైపు నుంచి మచిలీపట్నం వెళ్తున్న కారు ఢీకొట్టింది. నారాయణస్వామి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కార్మిక నేత మిక్కిలినేని పాపారావు కన్నుమూత

• ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, పలువురు ప్రముఖుల ఘననివాళి



మిక్కిలినేని పాపారావు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

చల్లపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : కార్మిక నేత, రైతు నాయకులు మిక్కిలినేని పాపారావు (92) శనివారం రాత్రి చల్లపల్లిలోని స్వగృహంలో కన్నుమూశారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు.

లక్ష్మీపురం చక్కెర కర్మాగారం కార్మిక సంఘం నేతగా కార్మికుల సమస్యలపై అలుపెరగని పోరాటం చేసిన పాపారావు, రైతులు, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. సీనియర్ సిటిజన్ ఫోరంతో సమాజాభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారు. పాపారావు స్వగ్రామం ఘంటసాల మండలం దాలిపర్రు. భార్య లక్ష్మీకాంతమ్మ సర్పంచ్‌గా పని చేసిన కాలంలో గ్రామాభివృద్ధికి విశేషంగా కృషి చేశారు. ఆయన కుమారుడు మిక్కిలినేని మధు టీడీపీ సీనియర్ నాయకునిగా ఉన్నారు.

ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, యువనేత మండలి వెంకట్రామ్ ఆదివారం పాపారావు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. తమ కుటుంబంతో పాపారావుకున్న అనుబంధాన్ని బుద్ధప్రసాద్ గుర్తుచేసుకున్నారు. పాపారావు తనయుడు మధును పరామర్శించి సానుభూతిని తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, మండల టీడీపీ అధ్యక్ష కార్యదర్శులు మోర్ల రాంబాబు, యార్లగడ్డ శ్రీనివాసరావు, ఎంపీపీ కోట విజయరాధిక, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఉపసర్పంచ్ ముమ్మనేని నాని, డీసీ చైర్మన్లు నిడమానూరి దిలీప్‌కుమార్, అయినపూడి భానుప్రకాష్, ఎంపీటీసీ సభ్యుడు మోపిదేవి ద్వారకానాథ్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి వెంకట రామకృష్ణ, మాజీ ఎంపీపీ యార్లగడ్డ లంకబాబు, వైద్యప్రముఖులు డాక్టర్ డీఆర్కే ప్రసాద్, పద్మావతి, సబ్బినేని భవానీప్రసాద్, ఎన్.కీర్తి, కూటమి నేతలు పరుచూరి సుభాష్ చంద్రబోస్, మండవ బాలవర్ధిరావు, కోనేరు బలరాం, దోనేపూడి గోపీకృష్ణ, కొడాలి మురళి, రావి చిట్టి, మోర్ల శివ, గువ్వాబత్తిన నాగేశ్వరరావు, అడపా రాంబాబు, వేమూరి రత్నగిరి, వీరమాచనేని భవానీప్రసాద్, ప్రముకులు పరుచూరి అంజయ్య, యార్లగడ్డ శివప్రసాద్, దుబ్బుల సాంబశివరావు, గొర్రెపాటి పిచ్చేశ్వరరావు, డాక్టర్ డి.శివప్రసాద్, మాలెంపాటి రంగారావు, నాదెళ్ల పూర్ణ, సబ్బినేని బోసు, కాట్రగడ్డ రామ్మోహనరావు, కెవిఆర్ఎస్.మిత్ర, తుమ్మల శ్రీను, వార్డుసభ్యులు మీర్ రిజ్వాన్, షేక్ సిలార్, ఆర్యవైశ్య సంఘ నేతలు అన్నవరపు పాండురంగారావు, వరదా హరిగోపాల్ నివాళులర్పించారు. వామపక్షాల నేతలు అడ్డాడ ప్రసాద్‌బాబు, హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, యద్దనపూడి మధు, కేసీపీ జీఎం బుల్లిపిచ్చియ్య, కార్మికసంఘ నేతలు తదితరులు పెద్దఎత్తున తరలివచ్చి పాపారావు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

చల్లపల్లి మున్సబు వీధిలోని కుమారుడు మధు ఇంటి వద్ద నుంచి పాపారావు భౌతికకాయాన్ని ఊరేగింపుగా స్వగ్రామం దాలిపర్రు తీసుకువెళ్లి వ్యవసాయభూమిలో అంత్యక్రియలు నిర్వహించారు.



ఖమ్మంలోని ఓ హోటల్‌లో కలుసుకున్న 1987- 90 బ్యాచ్ హిందూ లా కళాశాల పూర్వ విద్యార్థులు

'డీఎస్ఆర్' లా కళాశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ఖమ్మం లీగల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నంలోని ద్వైత శ్రీరాములు (డీఎస్ఆర్) హిందూ లా కళాశాలలో 1987-1990లో న్యాయవిద్యను అభ్యసించి.. ప్రస్తుతం తెలుగురాష్ట్రాలతో పాటు ఇతర ప్రాంతాల్లోని కోర్టుల్లో న్యాయవాదులుగా స్థిరపడిన వారంతా ఒక్కచోట కలుసుకున్నారు. డీఎస్ఆర్ కళాశాలలో న్యాయవిద్య పూర్తి చేసి 35 సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో ఖమ్మంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి హాజరయ్యారు. తాము లా చదువుకున్న నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. నాటికి.. నేటికి న్యాయ విద్య, న్యాయ వ్యవస్థలో వచ్చిన మార్పులపై చర్చించారు. ఆనం చిన్ని రామారావు, బిచ్చాల తిరుమలరావు, స్వామీజి మూర్తి, మువ్మినేని శ్రీనివాసరావు, మువ్వా నాగేశ్వరరావు, దేవకి శ్రీనివాసరావు గుప్తా, కొల్లు నర్సయ్య, తాతా రవి, అడపా మురళి తదితరులు హాజరయ్యారు.

దేవాంగులు ఐక్యంగా ముందుకు సాగాలి : ఊటుకూరు



దేవాంగ బాంధవ్యుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు సుబ్రహ్మణ్యేశ్వరరావు

గూడూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : ఐక్యత ద్వారానే సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి సాధించగలమని రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఊటుకూరు సుబ్రహ్మణ్యేశ్వరరావు అన్నారు. దేవాంగ బాంధవ్యుల ఆత్మీయ సమావేశం పోలవరం దేవాంగ కల్యాణ మండపంలో ఆదివారం జరిగింది. సుబ్రహ్మణ్యేశ్వరరావు మాట్లాడుతూ, దేవాంగ సమస్యల పరిష్కారం కోసం సంఘం ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. దేవాంగుల కుల వృత్తి చేనేత సంక్షోభంలో ఉందని, పరిశ్రమ పరిరక్షణకు సంఘం పాటు పడుతుందన్నారు. గౌరవాధ్యక్షుడు బొమ్మిన దుర్గాప్రసాద్, నక్కిన చిన వెంకటరాయుడు, మాడిశెట్టి శివశంకరయ్య, ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ చైర్మన్ బండారు ఆనందప్రసాద్, యర్రా శ్రీనివాసకుమార్, సర్పంచ్ నక్కిన వెంకట నాగరాజు, కారుపర్తి మల్లిరత్నం, కారుపర్తి గగన, మోహన త్రినాథ్ పాల్గొన్నారు.

హాకీ పూర్వవైభవానికి కృషి : సన్నిధి



గూడూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : హాకీకి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు సన్నిధి నాగసాయి శ్రీనివాస్ అన్నారు. గూడూరు హాకీ క్లబ్ కార్యవర్గ సమావేశంలో ఆదివారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. నాగసాయి శ్రీనివాస్ మాట్లాడుతూ, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు క్రీడాకారులను తయారు చేయడం, క్రీడా సామాగ్రి సమకూర్చడం ద్వారా హాకీ పట్ల యువతలో ఆసక్తి కలిగిస్తున్నామన్నారు. గూడూరు హాకీ క్లబ్ అధ్యక్షుడు మోటేపల్లి రత్నారావు, జిల్లా సెక్రటరీ శ్రవణం హరికృష్ణ, గూడూరు క్లబ్ ఉపాధ్యక్షుడు ఎంఏ సలీం, జనరల్ సెక్రటరీ పెనుగొండ శ్రీనివాసరావు, కోశాధికారి నిమ్మగడ్డ దుర్గాప్రసాద్, జిల్లా కోశాధికారి విఠల్, సభ్యులు ఆత్మూరి వెంకట సుబ్బారావు, గంగాధరరావు, అల్లంశెట్టి బ్రహ్మం, పోతన సుధాకర్, గూడూరు హైస్కూల్ పీడీ అరుణ, పీఈటీ రాజేష్, హాకీ క్రీడాకారులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ఒక్కరోజే రూ.10.79 లక్షలు

మోపిదేవి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. నాగపుట్టలో పాలుపోసి స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. వివిధ సేవల ద్వారా ఆదివారం ఒక్కరోజునే రూ.10,79,528 ఆదాయం లభించినట్లు ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు.

ఉదయపు నడక మిత్ర మండలి సభ్యులకు ఘన సత్కారం

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : ఉదయపు నడక మిత్ర మండలి మహిళా విభాగం ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన వార్షిక సమావేశంలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మహాత్మాగాంధీ ఫెలోషిప్ చెల్లించిన 12 మంది సభ్యులను సత్కరించారు. గుంటూరు రా మరాజు, మచిలీపట్నం వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జల్లు మురళీనాథ్, లంకిశెట్టి నీరజ, చిలంకుర్తి మహా లక్ష్మి, క్లబ్ మాజీ అధ్యక్షుడు కారుమూరి రాజేంద్రప్రసాద్, జగన్ మోహనరావు, ఘంటసాల రాము, కార్యదర్శి చిన్నం గంగాధరరావు పాల్గొన్నారు.

మేళ్లమర్తిలంకలో గంగానమ్మ పునఃప్రతిష్ఠా మహోత్సవాలు

మోపిదేవి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : మేళ్లమర్తిలంకలో స్వయంభువుగా కొలువుదీరిన గంగానమ్మ అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠా మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సోమవారం గంగానమ్మ అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠ సందర్భంగా ఆదివారం యార్లగడ్డ సోమశేఖర ప్రసాద్ (లంకబాబు), మాజీ సర్పంచ్ రమాదేవి, యార్లగడ్డ అరవింద్, అలివేణి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల చలో విజయవాడ 7న

ఘంటసాల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 7న జరిగే విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మహమ్మద్ కరీముల్లా పిలుపునిచ్చారు.

శ్రీకాకుళం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద చలో విజయవాడ వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. షిఫ్ట్ ఆపరేటర్ వీరబాబు తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వాసుపత్రిలో స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమం నిర్వహించారు. ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పరిసరాలను శుభ్రం చేశారు. జిల్లా ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఉపపర్యవేక్షణాధికారి డాక్టర్ జి.భానుమూర్తి, ఆదిత్య కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

చదరంగం విజేతలు వీరే

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు ముగిశాయి. అకాడమీ ప్రతినిధి ఫణికుమార్ విజేతలను ప్రకటించగా ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ బహుమతులందజేశారు. శామ్యూల్ స్టెఫిన్ ఎ హమల్ వర్షన్, జి.ఆముక్త, వి.త్రిపురాంబిక జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. స్టార్ మెంటార్ పి.శ్రీరాం, డైరెక్టర్ స్వామి, ప్రిన్సిపాల్ ఎల్.ఆదిత్య పాల్గొన్నారు.

ఎల్ఐసీ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఉద్యమం

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : జీవిత బీమా సంస్థను కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరించేందుకు యోచిస్తోందని, దీన్ని వ్యతిరేకించేందుకు ఉద్యోగులతో పాటు పాలసీదారులు ముందుకు రావాలని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం సెంట్రల్ జోనల్ మేనేజర్ పి.సతీష్‌కుమార్ కోరారు. వేడుక కల్యాణ మండపంలో ఆదివారం ఎల్ఐసీ ఉద్యోగుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సతీష్‌కుమార్ మాట్లాడారు. పాలసీదారులకు, ఉద్యోగులకు తెలియకుండానే కేంద్ర ప్రభుత్వం జీవిత బీమా సంస్థను నిర్వీర్యం చేస్తూ ప్రైవేటు బీమా సంస్థలను పరోక్షంగా, ప్రత్యక్షంగా ప్రోత్సహిస్తోందన్నారు. ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి జి.కిషోర్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, అధ్యక్షుడు జె. సుధాకర్, ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ సుధాకర్‌బాబు, బి.హెచ్.వి.ఎల్.రాధాకృష్ణమూర్తి, జి.రాము, కె.రాజారావు, సిహెచ్.రాజేష్, సాంబశివరావు, ఉద్యోగుల సంఘం నాయకుడు ఆర్.వి.రమేష్‌కుమార్ పాల్గొన్నారు.